# ఇరిగేషన్ పనుల్లో కాకాణి రూ. 150 కోట్లకు పైగా దోపిడీ

- ఒక్క షట్టర్ మార్చకుండానే రూ. 9 కోట్లు స్వాహా
- వైసీపీ పాలనలో దోపిడీపై విచారణకు సోమిరెడ్డి డిమాండ్
- చేయని పనికి బిల్లులు చేస్తే అధికారులకు శిక్ష తప్పదు
- బండేపల్లి కాలువను పరిశీలించిన సర్వేపల్లి ఎమ్మెల్యే
- రైతుల సమక్షంలో పనులు జరిగాయో లేదో ఆరా తీయాలని సూచన







**మనుబోలు, డిసెంబర్**

ఇరిగేషన్ పనులను దోపిడీకి వనరుగా మార్చుకున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.150 కోట్ల దోపిడీకి పాల్పడ్డారని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. చేయని పనికి ఒక్క రూపాయి బిల్లు చేసినా ఊరుకునే ప్రసక్తే లేదని, ఆ ప్రయత్నం చేసిన అధికారులు ఫలితం అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. వైసీపీ పాలనలో జరిగిన దోపిడీపై విచారణ జరిపిస్తామని, కాకాణి అండ్ బ్యాచ్ అవినీతిపై తాడో పేడో తేల్చుకుంటామని తెలిపారు.
మనుబోలు మండల పరిధిలోని బండేపల్లి, మడమనూరు గ్రామాల వద్ద బండేపల్లి కాలువను పరిశీలించిన సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రాస్ రెగ్యులేటర్లకు బిగించిన షట్టర్లను పరిశీలించిన ఆయన, ఆ షట్టర్లకు ఒకటికి మూడు సార్లు బిల్లులు చేసుకున్న కాకాణి బ్యాచ్ అని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క షట్టర్ కూడా మార్చలేదని రైతులు, రైతు నాయకులు స్పష్టం చేశారు.

**ఒక్కసారి కూడా షట్టర్ మార్చిన పాపాన పోలేదు**

ఇరిగేషన్ పనులను దోపిడీకి వనరుగా మార్చుకున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఒక్క షట్టర్ల మార్పు పేరుతోనే రూ.9 కోట్లకు పైగా దోపిడీ చేశారన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే దోపిడీకి తెరలేపారని తెలిపారు. బండేపల్లి కాలువపై ఆ ఏడాది డిసెంబర్‌లో ఓ షట్టర్ పేరుతో రూ.19 లక్షలు డ్రా చేశారని, అదే షట్టర్ పై ఏడాది గడవక ముందే మరో రూ.9 లక్షలు బిల్లు చేసుకున్నారని ఆరోపించారు. రెండు సార్లు బిల్లులు చేసుకున్నా ఒక్కసారి కూడా షట్టర్ మార్చిన పాపాన పోలేదన్నారు. అదే బండేపల్లి కాలువకు రెండు వైపులా ట్రెంచ్ కొట్టినట్టు రూ.2 కోట్లు జేబుల్లో వేసుకున్నారని, కనీసం సవిటికాలువ తవ్వినట్టు కూడా ఆనవాళ్లు లేవని తెలిపారు.
పనులు చేయకపోయినా ఇప్పుడు బిల్లులు పొందే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిసింది. రాజకీయాలకు అతీతంగా రైతుల సమక్షంలో పనులు జరిగాయో, లేదో ఆరా తీయమని అధికారులకు సూచిస్తున్నా. పని జరిగివుంటే నిరభ్యంతరంగా బిల్లులు చెల్లించేయండి, అదే చేయని పనులకు బిల్లులు చేస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునే ప్రసక్తే లేదు అని హెచ్చరించారు.
2019కి ముందు రైతులకు ఇబ్బంది లేకుండా క్రాస్ రెగ్యులేటర్ల వద్ద షట్టర్ నిర్మాణ పనులను నాణ్యతతో చేశామని, ఒక్కో క్రాస్ రెగ్యులేటర్‌కు రూ.10 లక్షల చొప్పున ఖర్చు పెట్టామని తెలిపారు. ఎలాంటి పనులు చేయకుండా ఆ క్రాస్ రెగ్యులేటర్లకు కూడా రెండు మూడు సార్లు షట్టర్లు మార్చినట్టు దోపిడీకి పాల్పడ్డారు అని ఆరోపించారు. రైతులకు తీరని అన్యాయం చేసిన శ్రీధర్ ఇంజనీరింగ్ కంపెనీని కూడా వదిలే ప్రసక్తే లేదన్నారు. ప్రతి పనిపై విచారణ జరుగుతుందని, దోపిడీకి పాల్పడిన వారి విషయంలో తాడో పేడో తేల్చుకుంటామని తెలిపారు.
2023లో ప్యాకేజీల పేరుతో పనులు చేయకుండానే రూ.18.50 కోట్లు తినేందుకు స్కెచ్ వేశారని, పనులు జరగకుండా ఒక్క రూపాయి బిల్లులు చెల్లించినా సంబంధిత అధికారులదే బాధ్యత అని తెలిపారు. ప్యాకేజీ పనులను సీఈ తిరస్కరించినా ఎన్నికలకు ముందు హడావుడిగా చెల్లించే ప్రయత్నం చేసిన ఎస్ఈ ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారన్నారు. దుర్మార్గాలు చేసిన వారు ఎక్కడ ఉన్నా వదిలే ప్రసక్తే లేదన్నారు.
ఐదు ప్యాకేజీల పేరుతో బిల్లులు చేసుకునే ప్రయత్నం చేసిన వారు కూడా ఫలితం అనుభవించాల్సిందేనని, రైతుల కోసం ఏ ఇరిగేషన్ పనిచేశారో గ్రామాల్లోకి వచ్చి చూపాలని కాకాణి గోవర్ధన్ రెడ్డికి సవాల్ విసురుతున్నా అని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో నాణ్యతతో చేసినా పనులకు కూడా బిల్లులు రాకుండా వైసీపీ నాయకులతో కేసులు వేయించి అడ్డుకున్నాడన్నారు. అన్నదాతల ప్రయోజనాలను ఫణంగా పెట్టి దోచేసిన వందల కోట్ల రూపాయలను కరోనా ప్యాలెస్ లో దాచేశాడని ఆరోపించారు.

# మేయర్ పదవికి పొట్లూరి స్రవంతి రాజీనామా

- అవిశ్వాస తీర్మానానికి ముందుగానే ప్రకటన
- 44 మంది కార్పొరేటర్లు మద్దతిస్తున్నారని తెలిపారు
- నీచ రాజకీయాలు భరించలేక రాజీనామా
- కార్పొరేటర్లను భయపెడుతున్నారని ఆరోపణ
- జిల్లా కలెక్టర్‌కు రాజీనామా లేఖ పంపుతామని ప్రకటన

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబర్ 13 :**



నెల్లూరు నగర కార్పొరేషన్‌లోని మేయర్ ఛాంబర్ లో మేయర్ పొట్లూరి స్రవంతి మీడియాతో మాట్లాడారు. అవిశ్వాస తీర్మానం కు సుమారు 44 మంది మద్దతిస్తుండటంతో, దీని మేరకు ముందుగానే పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం నీచమైన రాజకీయాలు జరుగుతున్నాయని, వాటిని భరించలేక రాజీనామా చేస్తున్నామని ఆమె తెలిపారు.
తాను ఒక గిరిజన బిడ్డనని, తన పదవిని తొలగించడానికి ఇన్ని కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మద్దతిస్తున్న కార్పొరేటర్లను, మహిళా కార్పొరేటర్లను కూడా చూడకుండా వారి ఇళ్లకు వెళ్లి భయపెడుతూ, బెదిరిస్తూ, కేసులు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. రాజీనామా లేఖను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని ఆమె తెలిపారు.
మంత్రి పొంగూరు నారాయణ, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, ఇతర నాయకులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మేయర్ పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నానని, ప్రజలకు ఎప్పుడూ చేరువగా ఉంటానని, వారి ఆశీస్సులు తమకు ఉన్నాయని ఆమె తెలిపారు.

# నెల్లూరు రాజకీయాల్లో కొత్త మలుపులు

- మంత్రి నారాయణ వ్యూహాలకు వైసీపీ ఉక్కిరిబిక్కిరి
- 42వ డివిజన్ కార్పొరేటర్ కరీముల్లా టీడీపీలోకి చేరిక
- వైసీపీ నగర అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ పార్టీ మార్పు
- మేయర్ అవిశ్వాస తీర్మానానికి ముందు రసకందాయంగా సింహపురి రాజకీయం
- అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నామని తెలిపిన కార్పొరేటర్లు
- స్వచ్ఛందంగానే నిర్ణయం, ఎవరి ప్రోద్బలం లేదని స్పష్టీకరణ
- టీడీపీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి నారాయణ
- వైసీపీ నేతల ఎత్తులను చిత్తు చేసిన మంత్రి నారాయణ వ్యూహాలు
- మేయర్ అవిశ్వాస తీర్మానం గెలిచి తీరుతామని టీడీపీ ధీమా

**నెల్లూరు ప్రతినిధి, డిసెంబర్ 13**







నెల్లూరు నగర రాజకీయం మలుపులు తిరుగుతోంది. ఈ నెల 18న మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో సింహపురి రాజకీయం రసకందాయంగా మారింది. మంత్రి పొంగూరు నారాయణ వ్యూహాలకు వైఎస్సార్సీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వైఎస్సార్సీపీ నుంచి కార్పొరేటర్లు టీడీపీలోకి క్యూ కడుతున్నారు. శనివారం తాజాగా 42వ డివిజన్ వైఎస్సార్సీపీ కార్పొరేటర్ షేక్ కరీముల్లా, వైఎస్సార్సీపీ నగర అధ్యక్షుడు, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులు యాదవ్ పార్టీ కండువా కప్పుకొని తెలుగుదేశంలో చేరారు. వీరిద్దరికీ మంత్రి నారాయణ, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**తప్పులో కాలు వేసిన వైఎస్సార్సీపీ**

మంత్రి నారాయణ ఎప్పుడూ అభివృద్ధిపై దృష్టి పెడతారని, రాజకీయం తెలీదు అనుకున్న వైఎస్సార్సీపీ పప్పులో కాలు వేసింది. అవిశ్వాస తీర్మానం వేళ అభివృద్ధి మంత్రిగా పేరుగాంచిన నారాయణ మరో కోణం చూపించారు. వ్యూహాత్మక ఎత్తుగడలతో వైఎస్సార్సీపీ పుచ్చుకున్నారు. వైఎస్సార్సీపీ నగర అధ్యక్షుడే పార్టీ మారిపోవడంతో ఆ పార్టీ నాయకులు అయోమయంలో పడిపోయారు.

**కార్పొరేటర్ల వ్యాఖ్యలు**

టీడీపీలో చేరిన అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ, మమ్మల్ని ఎన్నుకున్న ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే అధికార పార్టీ సహకారం కావాలని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత అభివృద్ధి కొనసాగించలేకపోయామని, మంత్రి నారాయణ నేతృత్వంలో పనిచేయాలనే టీడీపీలో చేరామని తెలిపారు. మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి టీడీపీలో చేరానన్నారు. తాను వైఎస్సార్సీపీలో ఉన్నప్పటికీ మంత్రి నారాయణ తనకు అనేక రకాలుగా సహాయం చేశారని, ఎప్పుడూ పార్టీ మారాలని నన్ను అడగలేదని తెలిపారు. తాను స్వచ్ఛందంగానే వైఎస్సార్సీపీ నుంచి టీడీపీలో చేరారన్నారు. మిగిలిన 11 నెలల పదవీ కాలంలో నగర అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరానని, తాను పార్టీ మారడం వెనుక ఎవరి ప్రోద్బలం లేదన్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం గెలిచి తీరుతామని తెలిపారు.

**రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు**

అనంతరం టీడీపీ అధికార ప్రతినిధి సంపత్ కుమార్ మాట్లాడుతూ, నెల్లూరు మేయర్ స్రవంతి ఎప్పుడూ మేయర్‌గా వ్యవహరించలేదన్నారు. రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు అని మంత్రి నారాయణ చెప్పారన్నారు. కార్పొరేటర్లు స్వచ్ఛందంగా పార్టీ మారి నగర అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించారని, వైఎస్సార్సీపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ నాయకుల భాష వల్లే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారని, కేవలం అభివృద్ధి కోసమే కార్పొరేటర్లు పార్టీ మారుతున్నారన్నారు. టీడీపీని గెలికి తప్పుచేసామని వైఎస్సార్సీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. మంత్రి నారాయణ సమక్షంలో త్వరలో మరో ఇద్దరు వైఎస్సార్సీపీ కార్పొరేటర్లు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని తెలిపారు.

# మహిళల రక్షణకు 'శక్తి' యాప్‌పై అవగాహన

- నెల్లూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమం
- శక్తి యాప్ తప్పక డౌన్‌లోడ్ చేసుకోవాలి
- విపత్కర పరిస్థితుల్లో పోలీసులు రక్షణ కల్పిస్తారు
- బస్టాండ్, రైల్వే స్టేషన్లు, దుకాణాల వద్ద అవగాహన
- పోక్సో, బాల్య వివాహాలు, డయల్ 100 పై వివరణ




**నెల్లూరు క్రైం, డిసెంబర్ 13 :**

నెల్లూరు జిల్లాలో 'శక్తి' యాప్ ఆవశ్యకత గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సూచనల మేరకు, శక్తి బృందాలచే జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, దుకాణాలు, ఇతర ప్రదేశాలలో ప్రజలకు, మహిళలకు, విద్యార్థినులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.
రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన శక్తి యాప్ మహిళల రక్షణ కవచం అని, ప్రతి మహిళ తప్పక డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు తెలిపారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల విపత్కర పరిస్థితులలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్షిస్తారని తెలిపారు. ప్రతి ఒక్క మహిళ, గృహిణులు, విద్యార్థినిలు, బాలికలు మొబైల్లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీస్ వారి తక్షణపు సహాయం పొందాలని పోలీసులు తెలిపారు.
ఈ అవగాహన కార్యక్రమంలో మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే విధానం, దాని ఉపయోగాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక, వెట్టిచాకిరీ వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, పోక్సో యాక్ట్, మాదకద్రవ్యాల నిషేధం, డయల్ 100, 112, 1098, 1930 మొదలగు అంశాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు.

# 1058 ఆలయాలకు రూ. 846 కోట్లు మంజూరు

- కర్నూలులో కొత్త దేవాదాయ శాఖ కార్యాలయం ప్రారంభం
- గోదావరి, కృష్ణా పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు

**కర్నూలు, డిసెంబర్ 13 :**







అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామికం, ఆధ్యాత్మికం అన్నింటిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని, రాష్ట్రంలో 1058 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.846 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.
శనివారం కర్నూలు నగరంలో రూ. 4.25 కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ: రాష్ట్ర దేవాదాయ శాఖ హెడ్ ఆఫీస్ విజయవాడలోని గొల్లపూడిలో ఉన్నట్లు గానే, రాయలసీమకు కర్నూలులో ఈ ఆధ్యాత్మిక భవనం ఏర్పాటు చేయడం సంతోషదాయకం అని పేర్కొన్నారు. ఆలయాల్లో పూజా కైంకర్యాలు, ఉత్సవాలు ఆగమ శాస్త్రం ప్రకారం పూజారులు, వేద పండితుల నిర్ణయాల మేరకే జరుగుతాయన్నారు. పురాతన ఆలయాలు, వాటి కట్టడాలను సంరక్షించే విధంగా ఈ శాఖ పని చేస్తుందని మంత్రి తెలిపారు.
ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో దేవాదాయ శాఖలో 98 శాతం నెరవేర్చాం అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 2372 మంది అర్చకులకు కనీస వేతనం కింద ప్రతి నెల రూ.15వేలు ఇస్తున్నామని, వేద విద్య నేర్చుకున్న 599 మంది అర్హులైన వేద పండితులకు సంభావన కింద నెలకు రూ.3 వేలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఆలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల చొప్పున వేతనం ఇస్తున్న ప్రభుత్వం తమదన్నారు.
రాష్ట్రంలో ఉన్న పెద్ద పెద్ద ఆలయాలన్నింటిని టూరిజం సర్క్యూట్ కింద చేర్చి, టెంపుల్ టూరిజంను రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆలయ భూములను పరిరక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధూపదీప నైవేద్యం కింద 2021 నుండి రూ.5వేల నుండి 10 వేలకు పెంచి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని, 5821 ఆలయాల్లో ప్రతినెల రూ.10 వేల చొప్పున పూజారి అకౌంట్లో ఈ మొత్తాన్ని జమ చేస్తున్నామని మంత్రి వివరించారు.
పురాతన ఆలయాల పునర్నిర్మాణం కోసం కామన్ కింద నిధులను మంజూరు చేసి పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 1058 ఆలయాలలో పునర్నిర్మాణ పనులు, గతంలో ఆపేసిన పనులన్నింటికీ రూ. 846 కోట్లు నిధులు మంజూరు చేశామని, ఒకటి, రెండు ఏళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యం లో దేవాలయాలకు పూర్వ వైభవం వస్తోందని మంత్రి తెలిపారు.

**ఘనంగా గోదావరి, కృష్ణా పుష్కరాలు**

రాష్ట్రంలో గోదావరి, కృష్ణా పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. 2027 జూన్ 26 నుంచి జూలై ఏడవ తేదీ వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు తేదీలను నిర్ణయించడం జరిగిందని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

# శ్రీవారి ఆలయం.. విద్యుత్తు వెలుగుల వైభవం



శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద ఉన్న గోపురంపై విద్యుత్తు వెలుగులు పడేలా దీపాలు ఏర్పాటు చేశారు. నీలం, నారింజ, ఎరుపు, పచ్చ రంగుల్లోని వెలుగులు రాత్రి వేళల్లో ఆలయ గోపురంపై పడటంతో సరికొత్త శోభను సంతరించుకుంది. శనివారం నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ

